


# గెలుపు

గోల్కొండ కోట బురుజు మీద చంద్రవంక పతాక రెపరెపలాడింది.

ఉదయ సూర్యుడి రక్తకిరణాలు కోట గోడలకు నెత్తురు పులుముతున్నాయి.

కోటలో తానీషాగారు అప్పుడే ఉదయాదశక్తత పోయేందుకు మొదటి మధుపాత్ర....అంటే పాత్రామాత్ర మధువును సేవించారు.

కోటలో అరబ్బీ గుర్రం హేషించింది – గోడ పక్కనే వున్న గుడిశెలోంచి ఓ గాడిద గోండ్రించింది.

ప్రభాతం. శుకపికశారికాకీరకాది....ఎందుకొచ్చిన బాధగాని ఒక్కమాటలో భళ్లున తెల్లవారింది, గోల్కొండ తానీషాగారి రాజ్యంలో! కాని....

ఆ సమయంలో అంటే ప్రభాతావాతయాతాహతికి, మోదుగ చెట్లూ, సన్నజాజులూ తలలు వంచి కొప్పుల్లోని రాత్రి వాడిన పూలను రాల్చేసే వేళలో అల్లంత దూరానవున్న ఒకానొక కొండ గుహలో యిద్దరు నడివయసువాళ్లు మాట్లాడుకుంటున్నారు – మంతనాలు జరుపుతున్నారు.

“మనిషి చేతులకు బొటన వేళ్లు రెండే గదా? కాస్త జాగ్రత్తగా పరీక్షిస్తే ఏది ఎడమ చేతిదో గ్రహించడం అంత కష్టసాధ్యం కాదు. అయినా శ్రమించి డబ్బూ, దర్పం ఒడ్డి సంపాయించాం. యీ ప్రాంతం అంతా జొన్నన్నం, జొన్న అంబలి తిని బతికే మోటురకం మనుషులు. మరి సున్నితమైన వేళ్లు సంపాయించాలంటే ఎంత ఖర్చో?”

“అబ్బే. అంతగా చెప్పనవసరం లేదు. నాకూ తెలుస్తూనే వుంది. కాని నా భార్య గుండె యింత కఠినాతికఠినం అని యింతకాలంగా....”

"అరే...అరే...పద్మినీ, యక్షిణీ, శాకినీ, ఢాకినీ అని స్త్రీ జాతులున్నా అసలదంతా ధనియాల జాతి. పాదరక్షా మర్దనం లేకుండా...."

ఆసరికి ఘూకనేత్రుడికి గుడ్లెర్రబడినై.

మారేడు కాయపాటి ప్రమాణంలో వున్న గొంతుముడి, కిందికీ పైకీ, ఆసులో కండెలా తిరిగింది.

నల్లని గుబ్బుగడ్డాన్నీ, కోరమీసాన్నీ వేళ్ళతో దులపరించి కాండ్రించి వూశాడు.

"ఘూకనేత్రా...." అంటూ ఏమో చెప్పబోయి గుండెచాలక గతుక్కుమన్నాడు ధనపాలుడు. మళ్ళీ గొంతు సవిరించుకుని, "నా భార్య కుసుమకోమలాంగి... బింబాధర..."

"ఐతే నాకేం? నా ఒళ్ళో ఒరిగేదేమిటి?" అంటూ ఛీంకరించాడు ఘూకనేత్రుడు.

ఐతే యిదంతా ఏమిటి? అడివిగోడూ, ఆలిచిప్పలూనా! అనిపిస్తోంది గదా మనకి. సరే, యిక కథకే వొద్దాం.

❀ ❀ ❀

ఘూకనేత్రుడు – తల్లిదండ్రులు పెట్టిన పేరేమిటో తెలియదుగాని, బందిపోటు దొంగగా పట్టా పుచ్చుకున్నప్పటినించీ ఆ పేరుతోనే పిలవబడుతున్నాడు.

ఆ రోజుల్లో ప్రభుత్వం యింత పకడ్బందీగా వుండేదికాదుగదా?

యిటు గోల్కొండా, అవతలవున్న రాజ్యపు ఎల్లల్లో నిరాఘాటంగా వ్యాపారం సాగిస్తున్నాడు.

యిక అతడితో మంతనాలాడుతున్న ధనపాలుడు, గోల్కొండ పట్టణంలో, రత్నకంబళాలమ్మే గొప్ప వర్తకుడు. అతడు ఎడాపెడా కాళ్లాచేతులా యింత సంపాయించింతరవాత ఒంటిమిట్టలో వున్న ఒక ధనిక వర్తకుడి కూతుర్ని వివాహం చేసుకున్నాడు.

పోతే ఆవిడ పీనపయోధర, చపలాక్షి....యింకా అలాంటలాంటి సర్వాంగ సహిత.... శోభిత... సౌందర్యరాశి – పేరు పంపకం. యిక్కడ – చంపకం అన్న పేరు అరసికుడైన ధనపాలుడి నోట్లో నలిగి పంపకం అయిందో లేక తలిదండ్రులు పెట్టిన పేరే పంపకమో చెప్పడం కష్టం.

ఏమైతేనేం – అందరూ ఆమెని 'పంపకం' అనే పిల్చేవారు. పైగా ఆమె ధనపాలుడి పాలిటి శాకినీ పంపకమే అయింది. వివాహం అయిన కొత్తల్లో ధనపాలుడు, పంపకాన్ని శిరసా ధరించేవాడు. కనుగీటే, గీటుగా భావించి ఆ హద్దుల్లో సంచరించేవాడు.

కాని, ఒకటి రెండు మూడు సంవత్సరాలు గడిచేసరికి భార్యా రూపం అరుచి కాజొచ్చింది. అందుకు పంపకంలో సౌందర్య, రసికత్వాల లేమి మాత్రం కారణం కాదు. సానలో తగుల్కొన్న వజ్రంలా ఆమె సౌందర్యం ససంవత్సర ప్రవర్ధమానమౌతూనే వుంది. శరీరానికి జగినిగి వార్నిష్ కొట్టిన సినిమా పత్రిక స్టార్ ముఖచిత్రంలా తళతళలు కాంతులు విరజిమ్ముతూనే వుంది. కాని....

తినగా తినగా వేమే తియ్యనవుతుంది – పంచతిక్త కషాయం పానకమవుతుంది?

అలాంటప్పుడు యీ చక్షుష్యను చూస్తే ధనపాలుడి చక్షువుల్లో కారం జల్లుకున్నట్టవడానికి తగిన కారణమే వుంది. ఆమె – ఆ పంపకం మూడు నిండు సంవత్సరాల దాంపత్యానంతరం కూడా యింత నెరసును, వంశోద్ధారకుణ్ని ధనపాలుడకి యివ్వలేకపోయింది.

యిక దానితో ధనపాలుడు, దండపాణి అయ్యాడు. పరాశరుడు, యోజన గంధి వృత్తాంతం కాదే? నిండు మూడు వత్సరాల కూటమే అని అతడికి కడుపు మండిపోయింది.

చెడిన చేను చూచి ఒడయడు మెచ్చడు గదా! ఆ పట్టున కోదండంపాణియై, 'ఛీ గొ్్ౕౕరాలా! యిదా నువ్వు చేసే పని? నా శ్రమంతా నిప్పున బోసిన నీటిచందం చేశావుగదా? శాకినీ, చిత్తినీ, డింబీ, హిడింబీ' అంటూ పంపకం కుసుమ కోమల దేహాన్ని రాసి రంపాన బెట్టాడు.

కొమ్మన అరముగ్గిన ఆ స్వాదుఫలం ధనపాలుడి ఊదరకు తాళలేక పోయింది.

నోములు, పూజలు, అశ్వత్థ ప్రదక్షిణలు, శతపత్ర, శతగ్రంథి శయనం – అన్నీ చేసి అనుభవించి చూసింది. ఏ దేవతకీ దయ కలక్కపోతే పాయె, గుడ్డి కన్నార్పితే ఏం? అప్పళిస్తే ఏం? కిన్నెర కింపురుషులుక్కూడా ఆమె మీద ఆదరువు కలగలేదు. 'కాయో, కసుగాయో' అని కూడా చేతులు జోడించి బ్రహ్మకు నమస్కరించింది – పొన్నచెట్టు మీద పోకిరి కృష్ణుడికి గోపికలు అంగలార్చినట్టు. ఉహుఁ అతగాడు ఉలకలేదు, పలకలేదు – చతుర్ముఖుల్లో కట్టకడపటిదైనా వంచి పంపకం కేసి తిలకించలేదు.

కాలం కొండ మీంచి జారిన బండరాయిలా దొర్లింది. మరో సంవత్సరం, పంపకం శాతోదరిగానే వుండిపోయింది. ధనపాలుడు రాత్రిళ్లు యింటికి రావడమే మానేశాడు. గోల్కొండ పురవీధుల్లోని మచ్చెకంట్ల వుచ్చుల్లో తగుల్గొన్నాడు. వ్యాపారార్థం తెచ్చిన రత్నకంబళ్లు వచోహరులకీ, ధూతికలకీ బహుమాన వస్తువులుగా చెల్లిపోతున్నై. యిక యింట్లో వున్న వెండి, బంగారం తామరసనేత్రలిండ్లలో పాదరసంలా ప్రవహింప సాగింది.

పంపకం సావధానంగా అంతా ఆలోచించింది.

యీ గండకత్తెరలోంచి బయటపడటం ఎలా? అని ఆలోచించింది.

ఒక్కసారి తన పుట్టినింటికి – ఆ ఒంటిమిట్ట నగరానికి వెళ్లొస్తే బావుండునే అని తలపోసింది. అష్టాదశ సంతానాన్ని కన్న అమ్మ తనకేమైనా సాయం చేయలేదా అని కూడా పరితపించింది.

ధనపాలుణ్ని అనుమతి కోసం యాచించింది.

అతడు సరే అన్నాడు. అని 'గొ్్ౕౕరాలు గోడల మధ్య వుంటేం, బయట వుంటేం?' అంటూ ముక్కు పుటాలు ఎగుర వేశాడు.

పంపకం ఒంటిమిట్ట చేరింది.

తల్లితో తన కడగళ్లు విన్నవించుకుంది.

కూతురు శరీరం మీద తేలిన వాతలు చూసి ఆ తల్లి కుమిలి ఏడ్చింది. వరలక్ష్మిని వేడుకోమన్నది, సావిత్రితో మొరపెట్టుకోమన్నది. వైజయంతిని అంజలి ఘటించి ఆరాధించమన్నది.

ఓ నెల రోజులుండి పంపకం భర్తృ గృహోభి ముఖయింది.

రోడ్లు లేవు, రైళ్లు లేవు. బస్సులు అంతకంటే లేవు. కాలిబాటలు, అవీ అడవుల్లో నుంచి, కొండల్లో నుంచీ. ఆ దారిలో పంపకాన్ని ఓ బందిపోటు దొంగ అడ్డగించాడు. వెంటవున్న దాసదాసీ జనులు ప్రాణభీతితో పారిపోయారు.



కాంచన కనకాల కోసం వచ్చిన ఆ బందిపోటు, ఆ కామినీ సౌందర్యానికి ముగ్ధుడై ఏమన్నాడయ్యా అంటే – "చారుభళా, చారుభళా..." ఆపైన వినదగిందేగాని, రాయదగింది కాదు గనక వదిలేద్దాం. ఆ పాటకీ, కంఠమాధుర్యానికీ పంపకం పరవశత్వం చెందింది. కాని ఎదుట ఏ కిన్నెరుడో, కిరాతుడో కాక యింతపాటి దుబ్బుగడ్డం, కోరమీసం, దీర్ఘ దంష్ట్రాలూ, జాంబవంతుడిలాంటి నరవానరం కనబడేసరికి కెవ్వున కేక వేసి మూర్ఛపడి పోయింది. ఆ పడటం ఆ బందిపోటు కబంధహస్తాల్లోనే జారింది.

కాసేపటికి పంపకం తన మూర్ఛ తానే తెలుసుకుని లేవబోయేసరికి నరవానరం బిగిపట్టులో బంధింపబడి వున్నానని గ్రహించింది. కంపితగాత్రయై ముక్కోటి దేవతలనూ పేరు పేరున ప్రార్థించింది. కాని సృష్టికి అడ్డుపడగల శక్తి వారికెక్కడిది? పైగా కొందరు కొంటె దేవతలు పూల వృష్టికూడా కురిపించారు. 'నీ నోములు ఫలించనున్నవి లేవే లలనామణీ!' అని కూడా కొందరు దీవించారు.

పంపకం ఎలా అయితేనేం యిల్లు చేరింది ఏడు'వారాల సొమ్ములతోనూ. ఆ బందిపోటు, వృత్తిధర్మం మరిచాడు! ఆహాఁ!

ధనపాలుడు యింటికొచ్చిన భార్య నునులేత బుగ్గల మీద అల్లంత క్షతం, పెదల మీద తటిల్ల తలా దుందుడుకు నాట్యం చేసే హాసం పసిగట్టాడు. ఏమిటి మార్పు? అన్న జిజ్ఞాసలో పడ్డాడు.

యిక సాధింపు పంపకం వంతయింది. ధనపాలుడిని చవటవాజమ్మ కింద కట్టింది. తమల

పాకుతో అతడొకటంటే, తలుపు చెక్కతో రెండన సాగింది. నెలలు నడుస్తున్నాయి. తన గర్భగోళంలో కుర్రకుంకే దురుసుగా నడయాడుతున్నట్టు ఆమెకు అనుభూతి కాసాగింది.

భర్తతో జరిగింది జరిగినట్టు చెప్పేసింది. 'ఎవరు గొడ్రాలు?' అని నిలదీసి అడిగింది. ఛీ, రొయ్యకు లేదా బారెడు మీసం అన్నది. డబ్బు దస్కం తన చేతిలోకి తీసుకున్నది. భర్తకి వేళకింత అన్నం – అంతే! నవమాసాలకల్లా ఒక జాంబవంతుడిలాంటి కుర్రవెధవను కన్నది.

ధనపాలుడు గాలానికి చిక్కుకున్న చేపలా గిలగిలలాడిపోయాడు. పురకామినీ మణులంతా అతణ్ని పిచ్చిపుల్లాయి కింద కట్టేశారు. డబ్బు ఎలా సంపాయించడం? అన్న ఆలోచన పడింది ధనపాలుడికి. ఎంత చచ్చినా మగపుట్టకాయె మరి! అందుకే ఒక తంత్రం వేసి బందిపోటు ఘూకనేత్రుడి దగ్గరకు చేరాడు.

యిక ఆ యిద్దరూ సంప్రదించుకున్నారు. తనను బందిపోటు దొంగలు బందీగా పట్టుకున్నట్టు వెయ్యి వరహాలు యిస్తే గాని వదలనట్టూ భార్యకు తెలివిడి చేశాడు. పంపకం ఏమీ విననట్టే వూరుకున్నది. మళ్లీ ఆలోచించి, యీసారి ఒక బొటన వేలు ఎవరో అభాగ్యుడిది నరికించి అది ధనపాలుడిదే అయినట్టు దూత ద్వారా ఘూకనేత్రుడితో భార్యకు కబురంపించాడు.

పంపకం మళ్లీ వూరుకున్నది.

పరిస్థితులు యిలా ఎదురుతిరిగేసరికి తన విడుదలకు భార్య పంపే ఆ వెయ్యి వరహాలలో భాగస్థుడైన బందిపోటుకూ, ధనపాలుడిక్కూడా మతిపోయినంత పనైంది. పైగా బొటన వేళ్ళు కావాలన్నప్పుడల్లా దొరికేందుకు, చెట్టున కాచేవి కావాయె!

❀ ❀ ❀

ఓ వారం రోజుల తరవాత బందిపోటూ, ధనపాలుడూ గోల్కొండ నగరం వెళ్లి, స్వయంగా అన్ని సంగతులూ తెలుసుకుందామనుకున్నారు. కాలం కర్మం కలిసివచ్చినట్టు, ఆ సమయానికి ఒకానొక రామదాసు అనే భక్తుడు కారాగార విముక్తి పొందినందుకు ఏవో వుత్సవాలు కూడా చేస్తున్నారు. మారువేషాల్లో వెళ్ళి ఆ మందలో కలుద్దాం అనుకున్నారు వీళ్లు.

చింకిగుడ్డలు ధరించి ధనపాలుడూ, ఘూకనేత్రుడూ గోల్కొండ చేరారు.

అప్పటికే బాగా చీకటి పడింది. నగర ద్వారాలు మూసేవేళ అయింది. ఎట్లా అయితేం సరీగా వేళకు వీళ్ళిద్దరూ గేటు దాటి పట్టణం ప్రవేశించారు.

అదే సమయంలో గస్తీ తిరుగుతున్న రాజభటులు వీళ్ళని చూశారు. వీళ్ల వేషభాషలు వాళ్లకు అనుమానం కలిగించినై. సరే, మంచీ చెడ్డలు తరవాత చూడొచ్చని, సమయానికి రామదాసు ఖాళీ చేసిన ఖైదు కొట్లలోనే వీళ్ళిద్దర్నీ పడవేశారు.

కథ యిలా అడ్డం తిరిగినందుకు వాళ్ళిద్దరూ తలలు పట్టుకుని దుఃఖించారు. చాతనైన స్వేచ్ఛావ్యాపారం వొదులుకుని యిక్కడి కెందుకొచ్చానా అని బందిపోటు ఒకటే ఏడుపు.

తెల్లవారింది.

కారాగృహాధిపతి వీళ్ళిద్దర్నీ హాజరు పెట్టమన్నాడు. భటులు పెడరెక్కలు విరచి యిద్దర్నీ హాజరు

పెట్టారు. 'మీరెవరు?' అన్న ప్రశ్నకు బందిపోటు, తనో కూలి చేసుకు బ్రతికేవాణ్ణని చెప్పాడు. ధనపాలుడు మాత్రం, తను గోల్కొండ పురవాసినేననీ బీదవర్తకుణ్ణనీ బొంకాడు.

జైలర్‌కి కాస్త ఆశ కలిగింది. బందిపోటును తిరిగి గదికి పంపి, ధనపాలుడికి లాఠీపోట్లు బహూకరించాడు. నూరు మొహరీలు తెస్తే విడుదల. లేకపోతే రోజు లాఠీ పోట్లు తప్పవన్నాడు. యిక చేసేదిలేక ధనపాలుడు తన భార్య పేరు చెప్పేశాడు.

జైలర్ పంపకం దగ్గరకు భటుల్ని పంపాడు. వాళ్ళు తిరిగి రాగానే హుటాహుటిని జైలు గదికి వెళ్లి ధనపాలుడి చేతివేళ్ళు పరీక్షించాడు. యిక అతడి రౌద్రానికి హద్దు లేకుండా పోయింది.

"ఒరే శనిరాయుడూ! నన్నే వెధవను చేస్తావా? తన భర్తకు చేతి బొటన వేళ్ళు వుండవనీ, అతడే అయితే విడుదల కోసం వంద మొహరీలు యిస్తాననీ కబురు చేసింది. యిక నీవేమో అన్ని వేళ్ళతోనూ దుక్కలా వుంటివి! యిదా నీ మోసం..." అంటూ మళ్లీ లాఠీపోట్ల కుపక్రమించాడు.

నాలుగైదు రోజులు గడిచింతర్వాత పంపకానికి ఏదో అనుమానం తగిలి, తన సేవకుణ్ణి జైలు అధికారి దగ్గరకు పంపింది.

"ఆ జైల్లో వున్నవాడు మీ యజమానే అయితే యీనూరు మొహరీలూ యిచ్చి విడిపించుకురా! పోతే వెంట మరెవడో వున్నాడట! వాణ్ణి మాత్రం వదలకుండా అక్కడే వుంచి నలగపొడిచేందుకు యీ యాభై మొహరీలూ యివ్వు!" అని చెప్పి పంపింది.

ఆ సేవకుడు వెళ్ళి జైలు అధికారి అనుజ్ఞతో ఆ ఖైదీలను చూశాడు. యజమానిని గుర్తించాడు. సరే, జైలు అధికారి దగ్గరకు వెళ్ళి నూరు మొహరీలూ చెల్లించి, విడుదల కోరాడు. ఆ యాభై వరహాలూ యిచ్చి ఆ రెండోవాణ్ణి ఖైదులోనే వుంచి బొమికల్లో సున్నం లేకుండా కొట్టవలసిందని కోరాడు. జైలు అధికారి సంతోషానికి మేరలేదు. ధనపాలుణ్ణి వుదయమే విడుదల చేస్తానన్నాడు. ఆ రెండోవాణ్ణి కుళ్లబొడిపిస్తానని మాట యిచ్చి, లాఠీలకు కొత్త పన్నులు తగిలించవలసిందని భటులకు ఆజ్ఞాపించాడు.

సేవకుడు యింటికి వెళ్ళి సంగతంతా పంపకానికి చెప్పాడు.

ఆమె అంతా విని –"ఆ రెండో వెధవ ఎలా వుంటాడూ?" అని అడిగింది.

"వాడా...వాడు! యింత దుబ్బులాంటి గడ్డం, కోరమీసం, రాక్షసుడిలా యింత పొడవు పళ్ళూ....."

"అలాగా, అలాగా!" అంటూ గుండెలు అవిసిపోయేలా అరిచింది పంపకం.

"నువ్వు వెంటనే వెళ్ళి యీ నూరు మొహరీలూ ఆ జైలు అధికారికిచ్చి ఆ పిశాచాన్ని కూడా వదలమను!" అంటూ సేవకుణ్ణి వేగిర పరిచింది.

సేవకుడు నూరు మొహరీలూ తీసుకుని గోల్కొండ వీధుల్లో పందెపు గుర్రంలా పరిగెత్తసాగాడు.

పంపకం ఆ పక్కనే పిల్లితోక మెలిపెడుతున్న కొడుకును ఎత్తుకుని, "ఓరి పిశాచపు వెధవా! మీ అయ్య బ్రహ్మరాక్షసిగాడు జైల్లో వున్నాడ్రా!" అంటూ ముద్దు పెట్టుకుని, ఫక్కున నవ్వింది.

❋

*(అభిసారిక మాసపత్రిక : 1940–49)*